క్లుప్తంగా

చర్మ వ్యాధులపై అవగాహన ఉండాలి



అధ్యాపకులకు సలహాలు ఇస్తున్న వైద్యులు

తిరుపతి సిటీ : చర్మ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ)వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో బుధవారం వర్సిటీ హెల్త్ సెంటర్, కరకంబాడిలోని అమర హాస్పిటల్ సంయుక్తంగా చర్మవ్యాధులపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది చర్మవ్యాధులపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ రాఘవాచారులు, రిజిస్ట్రార్ రమాశ్రీ, అమర హాస్పిట్ వైద్య సిబ్బంది, వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 132 మందికి ఉద్యోగాలు



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

తిరుపతి సిటీ : భవానీ నగర్‌లోని గేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 132 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం రమేష్ తెలిపారు. మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 220 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపి ఉద్యోగాలకు ఎంపికైన 132 మంది విద్యార్థులను కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్, పి వెంకటప్రసాద్, రఫీ, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు భద్రతా నియమాలతో ప్రమాదాలకు చెక్




అవగాహన కల్పిస్తున్న ట్రస్టు సభ్యులు, పోలీసులు

తిరుపతి(అలిపిరి): రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప తెలిపారు. ప్రజా సాధికారిక ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం సహకారంతో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రత అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం టౌన్‌క్లబ్ ప్రాంతంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజా సాధికారిక ట్రస్టు ప్రెసిడెంట్ బాలాజీ, ట్రాఫిక్ పోలీసులు, ట్రస్టు సభ్యులు సురేష్, కన్నయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళల సంరక్షణకు నాటక, నృత్య పోటీలు

తిరుపతి కల్చరల్: కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయ కళల సంరక్షణే లక్ష్యంగా జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు నిర్వహిస్తున్నామని, అందులో కళాసంస్థలు, కళాకారులు భాగస్వాములు కావాలని అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్.రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ సహకారంతో 23 ఏళ్లుగా జాతీయ స్థాయిలో పౌరాణిక, సాంఘిక నాటకాలు, శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది జూలై 20 నుంచి 28వ తేదీ వరకు తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో పోటీలు చేపడుతున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన వారు ఏప్రిల్ 19వ తేదీలోపు దరఖాస్తులు పంపాలని సూచించారు. మే 20వ తేదీ పౌరాణిక పద్యనాటకాలు, సాంఘిక నాటికల ప్రాథమిక పరిశీలన ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 9581154667లో సంప్రదించాలని కోరారు.

సీనియర్ న్యాయవాది మృతి



కేఎస్.శ్రీధర్ (ఫైల్)

తిరుపతి లీగల్: తిరుపతికి చెందిన సీనియర్ న్యాయవాది కేఎస్.శ్రీధర్ బుధవారం చెన్నైలో మృతి చెందినట్లు తిరుపతి న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఆయన 1968 నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన మృతిపై గురువారం ఉదయం 10.30 గంటలకు తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో సంతాప సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన భౌతికాయాన్ని తిరుపతి కరకంబాడి రోడ్డులోని అట్లాంట పాఠశాల వద్ద ఉంచనున్నారు.

వసుధకు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ మనస్తత్వ శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని పసుపులేటి వసుధకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె ప్రస్తుత వీసీ వి శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షణలో స్ట్రెస్ సోషల్ సపోర్ట్ అండ్ సైకలాజికల్ వెల్ బీయింగ్ అమాంగ్ ఎల్డర్లీ అనే అంశంపై పరిశోధన చేశారు.

జగనన్న పాలనలోనే మహిళా సాధికారత

- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నే రావాలి
- తిరుపతిలో ఎవరికీ సాధ్యం కాని విధంగా అభివృద్ధి పనులు
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



మహిళల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి, పక్కన మేయర్ శిరీష

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మహిళా సాధికారత సాధ్యమని డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి చెప్పారు. ఆయన బుధవారం మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి తిరుపతి పెద్దకాపువీధి మహిళలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఆయనకు మహిళలు ఘన స్వాగతం పలికారు. భూమన అభినయ్‌రెడ్డి, సీఎం జగనన్న మహిళలకు చేసినంత మేలు గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేదని చెప్పారు. జగనన్న అందించిన అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు తదితర పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నింపారని సంతోషం వ్యక్తం చేశారు. తిరుపతిలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేశారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి రుణం తీర్చుకుంటామని హామీ ఇచ్చారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న అనేక సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. జగనన్న అధికారంలో ఉంటేనే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకుని ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 20 ఏళ్లల్లో ఎవరికీ సాధ్యం కాని అభివృద్ధిని చేసి చూపామన్నారు. 22 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంతో తిరుపతి నగరంలోని రహదారులు స్వర్గధామంగా మారాయని సగర్వంగా చెప్పారు. ప్రతి రహదారికి మహనీయులను గుర్తు చేస్తూ వారి పేర్లను పెట్టామని వివరించారు. తిరుపతి పెద్దకాపువీధితో పాటు నగరంలోని అనేక ప్రాంతాల్లో 22ఏను రద్దు చేయించి సుమారు 8 వేల మంది పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించామన్నారు. రానున్న రోజుల్లో తిరుపతిని క్రైం ఫ్రీ సిటీగా, అత్యంత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.



వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్న మహిళలు

పది రోజుల్లో రోడ్లన్నీ అందుబాటులోకి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: నిర్మాణం పూర్తయిన రోడ్లను పది రోజుల్లో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం 17వ డివిజన్లో చేపట్టిన కనెక్టివిటీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి కనెక్టివిటీ, లింక్ పెంచడంపై దృష్టి సారించామన్నారు. నగరంలో అవసరమైన చోట రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నట్టు చెప్పారు. 17వ డివిజన్‌లోని ఆర్సీ రోడ్డు నుంచి పళని థియేటర్, దాసరి మఠం, గోపాల్ రాజ్ కాలనీ మీదుగా డీఆర్ మహల్ రోడ్డును కలుపుతూ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఇది పూర్తయితే చాలా వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఎస్ఈ మోహన్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కార్పొరేటర్ గణేష్, నాయకులు తాళ్లూరి ప్రసాద్, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

వేద వాఙ్మయంలో వైమానిక శాస్త్ర విజ్ఞానం

తిరుపతి సిటీ: వేద వాఙ్మయంలోనే వైమానిక శాస్త్ర విజ్ఞానం ఉందని వేద శాస్త్ర పురాణ జ్యోతిష్య న్యాయ వేదాంత పండితులు చిర్రావూరి శివరామకృష్ణ శర్మ తెలిపారు. భారతీయ విజ్ఞానధార ఉపన్యాస మాలికలో భాగంగా ప్రాచీన భారతీయ విమాన శాస్త్ర పరిచయం అనే శీర్షికపైన ఉపన్యాస కార్యక్రమం బుధవారం రామేశ్వర భవనంలో వీసీ రాణి సదాశివమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ వేద ఇతిహాస శాస్త్రాల్లో నిగూఢంగా నిక్షిప్తమైన వైజ్ఞానిక అంశాలను తెలియజేస్తూ భరద్వాజ మహర్షి బృహత్ యంత్ర సర్వస్వంను రచించారని వివరించారు. మహాభారతంలో 350 శాస్త్రాలకు పైగా చెప్పినట్టు, వీటన్నిటిని అధ్యయనం చేసి సనాతన ధర్మాన్ని ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి, సంయోజకులు ఆచార్య రాధేశ్యామ్, సౌమ్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం.. అభివృద్ధిని ఆహ్వానిద్దాం



ఆటోకు ప్రచార స్టిక్కర్ అంటిస్తున్న ఎస్‌కే బాబు

తిరుపతి కల్చరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని తిరుపతి నగర అభివృద్ధిలో భాగస్వాములవుదామని మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కార్పొరేటర్ కోటూరి ఆంజనేయులు, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు పిలుపు నిచ్చారు. వారు బుధవారం లక్ష్మీపురం సర్కిల్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీని గెలిపించండి... అభివృద్ధిని ఆహ్వానించండి అనే నినాదంతో కూడిన ప్రచార స్టిక్కర్స్‌ను బుధవారం వారు ఆవిష్కరించారు. అనంతరం ప్రచార స్టిక్కర్లను ఆటోలకు అంటించి ప్రచారాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా తిరుపతిలో ఎన్నడూ జరగని అభివృద్ధిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసి చూపిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించుకుని ఆధ్యాత్మిక తిరుపతి నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో నేతలు అమరనాథ్‌రెడ్డి, రాపూరి ప్రసాద్, కుమార్, వెంకటరత్నం, కె.నాగరాజు, హరినాథరెడ్డి, మోహన్, శ్రీను, ఆర్ఎం.నాగరాజు, సిద్దూ, ఆటో యూనియన్ అధ్యక్షుడు చిన్న, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రేపు తిరుపతిలో బలిజల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న నీలం బాలాజీ, ముద్రనారాయణ

తిరుపతి కల్చరల్: బలిజల అభ్యున్నతే లక్ష్యంగా శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్టు డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, బలిజ జేఏసీ కన్వీనర్ నీలం బాలాజీ తెలిపారు. వారు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత 40 ఏళ్లుగా పాలకులు, బలిజ వర్గానికి చెందిన నేతలు బలిజలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని, సంక్షేమం గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. బలిజలు ఐక్యతతో అడుగులు వేస్తూ బలిజ భవనానికి ఎకరా 50 సెంట్ల స్థలం సాధించుకుని ప్రహరీ గోడ నిర్మించినట్టు తెలిపారు. ఇటీవల కాపు కార్పొరేషన్ చైర్మన్ ఆ స్థలాన్ని సందర్శించి భవన నిర్మానానికి రూ.2 కోట్లు మంజూరు చేయిస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తిరుపతి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బలిజల అభివృద్ధి, అభ్యున్నతికై బలిజలందరూ ఐక్యతతో ముందడుగు వేస్తూ మన ఆకాంక్ష నెరవేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మేరకు చేపట్టే ఆత్మీయ సమావేశానికి బలిజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేటర్లు దూది కుమారి, పొన్నాల చంద్ర, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, బలిజ నేతలు దొరైరాజు, మద్దాలి శేఖర్, చిన్నముని, వెంకటేష్ రాయల్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అనిల్ రాయల్, తిరుమల బలిజ నేతలు బెల్లం రమేష్, సురేష్ పాల్గొన్నారు.

భాష్యంలో సైన్స్‌డే వేడుకలు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు, అతిథులు

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక ధనలక్ష్మి నగర్‌లోని భాష్యం విద్యా సంస్థలో సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని బుధవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.ఎం. కుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సుమారు 150 వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రదర్శనలను వివరించిన తీరు ఆకట్టుకుంది. గెలుపొందిన ఉత్తమ సైన్స్ ప్రదర్శనలకు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్, ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులు, ఆంజనేయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో మార్చి నెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. మార్చి 1, 8, 15, 29వ తేదీల్లో సాయంత్రం 6 గంటలకు ఆండాళ్ అమ్మవారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. 8వ తేదీన శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకొని సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. 16న రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5.30 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత పార్థసారథిస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిస్తారు. 25న పౌర్ణమి, పంగుణి ఉత్తర ఉత్సవం సందర్భంగా రాత్రి 9.30 గంటలకు స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతారు.

విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డి ఉమాదేవి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ప్రారంభమైంది. డీన్ అనూరాధ మాట్లాడుతూ వేధింపులు, దాడులు జరిగే సమయంలో మహిళలు తమను తాము రక్షించుకునేందుకు కరాటే వంటి విద్యలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

16 నుంచి తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్చి 16 నుంచి 24వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. మార్చి 15న సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు వాహన సేవలు నిర్వహిస్తారు. 16న ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంసవాహనం, 17 ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి హనుమంత వాహనం, 18న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సింహ వాహనం, 19న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి పెద్దశేష వాహనం, 20న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి గజవాహనం, 21న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, కల్యాణోత్సవం, గరుడ వాహనం, 22న ఉదయం రథోత్సవం, రాత్రి ధూళి ఉత్సవం, 23న ఉదయం-సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, పార్వేట ఉత్సవం, అశ్వ వాహనం, 24న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, 21న రాత్రి 8 నుంచి 10 గంటల వరకు కల్యాణోత్సవం జరుగనుంది. అలాగే 25న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు.

సీపీఎం కలెక్టరేట్ ముట్టడి

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలం కరకంబాడీ వద్ద ఎర్రగుట్టపై పేదలు ఆక్రమించిన స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకోవడాన్ని నిరసిస్తూ సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య తప్పుపట్టారు. వారు పేదలతో కలిసి బుధవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ గేట్లు మూసి వేశారు. సమాచారం అందుకున్న డీఆర్వో పెంచల కిషోర్ అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. పరిశీలన చేసి న్యాయం చేస్తామని వెల్లడించారు. దీంతో ఆందోళనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక



తిరుపతి కల్చరల్ : తుమ్మలగుంట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం సబ్ జూనియర్ బాక్సింగ్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. అతిథులుగా డీఎస్‌డీఓ సయ్యద్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్, ఎం.హేమ్‌కుమార్ హాజరయ్యారు. సయ్యద్ మాట్లాడుతూ బాక్సింగ్‌లో ప్రపంచ చాంపియన్ మైక్ టైసన్‌ను ఆదర్శంగా తీసుకుని పట్టుదల, క్రమశిక్షణతో రాణించాలని కోరారు. ప్రవీణ్ మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే స్టేట్ చాంపియన్ షిప్ కోసం క్రీడాకారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. బాలుర విభాగంలో వై.ఆదర్శ్‌కుమార్, ఎన్.ధనుష్, ఎస్.శశిధర్, వి.కార్తీక్, టి.తేజ జి.కార్తీక్, కె.నిరంజన్, బాలికల జట్టుకు కె. గంగన, వి.జ్యోత్స్న, సి.హర్ష ఎంపికయ్యారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



విశ్వం పాఠశాలలో సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి సిటీ : స్థానిక ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విద్యార్థులు ప్రదర్శించిన పలు సైన్స్ ప్రయోగాలు, పర్యావరణ పరిరక్షణపై చిత్రించిన పెయింటింగ్ గ్రాఫ్స్ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ బి సత్యనారాయణ మాట్లాడుతూ సీవీ రామన్ దేశానికి చేసిన కృషి ఎనలేనిదని, యువత ఆయను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మనవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఎస్వీడబ్ల్యూలో...

పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి నారాయణమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ప్రయోగాలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్వీయూ హోం సైన్స్ ప్రొఫెసర్ కేవీ సుచరిత, అధ్యాపకులు ఉమారాణి, భువనేశ్వరి, విద్యుల్లత పాల్గొన్నారు.

మహిళావర్సిటీలో..

మహిళావర్సిటీలో సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ ఆవరణలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. వీసీ భారతి మాట్లాడుతూ విద్యార్థులు సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు.

ఎస్వీయూలో..

సీవీ రామన్‌ను యువత ఆదర్శంగా తీసుకుని దేశ సేవకు అంకితం కావాలని ఎస్వీయూ వీసీ వి శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతీయుడుగా దేశానికి ఒక మంచి పనిచేయాలనే తపనతో విద్యార్థులు ముందుకుసాగాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ వి రాజగోపాల్, రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, ప్రిన్సిపాల్ తులసి రామకృష్ణారెడ్డి, ఆచార్య కిశోర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో..

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి నగరంలోని పలు ప్రభుత్వ, టీటీడీ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో సైన్సు ఎగ్జిబిషన్లు నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దైనందిన జీవితంలో సైన్సు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. జీవకోనలోని విశ్వం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు తిరుపతి నగర డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి అభినందించారు. విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. సప్తగిరి కాలనీలోని శ్రీనివాస హైస్కూల్లో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా తిరుపతి అర్బన్ ఎంఈవో-1 బాలాజీ పాల్గొని సైన్స్ నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై టీడీపీ నేత దాడి



వెంకటేష్ రాయల్‌పై దాడిచేస్తున్న టీడీపీ కృష్ణయాదవ్

తిరుపతి మంగళం: తిరుపతి 3వ డివిజన్ వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ రాయల్‌పై బుధవారం రాత్రి టీడీపీ నాయకుడు, తుడా మాజీ చైర్మన్ నరసింహ యాదవ్ సోదరుడు కృష్ణ యాదవ్ దాడికి పాల్పడ్డాడు. వెంకటేష్‌రాయల్ రాత్రి గంటల ప్రాంతంలో లక్ష్మీ పురంలో ఉన్న తన దుకాణాన్ని మూసేందుకు ప్రయత్నిస్తుండగా టీడీపీ నాయకుడు కృష్ణయాదవ్ అక్కడికి వచ్చాడు. 'రే నాకొడకా నీ షాప్‌లో నేను మందు త్రాగాలి రా.. షాప్ మూయొద్దురా' అంటూ కేకలు వేశాడు. తనకు అడ్డు వచ్చిన వారిని పక్కకు తోసేసి వెంకటేష్‌రాయల్ చొక్కా పట్టుకొని దాడికి దిగాడు. చుట్టుపక్కలనున్న ప్రజలు రావడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ తమ్ముడు గణేష్, మరికొంతమంది నాయకులు అక్కడికి చేరుకున్నారు. సంఘటన వివరాలు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



ఐతేపల్లిలో ఎమ్మెల్యే వివాహ కానుకను అందజేస్తున్న నాయకులు

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లికి చెందిన నాగేంద్ర, సంధ్యకు వివాహం కుదరడంతో ఎమ్మెల్యే వివాహ కానుకను బుధవారం ఆ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఫాజిలా, గ్రామ కమిటీ అధ్యక్షుడు గొబ్బిళ్ల కిషోర్‌తో కలసి నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పంపిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాచికం, ముహూర్తపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు-కుంకుమతో కూడిన కానుకను అందించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సచివాలయ కన్వీనర్ లోకేష్ రెడ్డి, నాయకులు మల్లం రాజశేఖర్, అంజాద్, సోమశేఖర్ రెడ్డి, బాలాజీ, చంద్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీకి చెందిన జి.శశిధర్, బి.హిమబిందు ఇటీవల పెళ్లి నిశ్చయమైంది. ఈ మేరకు బుధవారం స్థానిక నాయకులు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందిస్తున్న పెళ్లి కానుకను అందజేశారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, బాజికాలు, పట్టుదుస్తులు, తిరుమల శ్రీవారి ప్రసాదంతో పాటు గ్రీటింగ్ కార్డును అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇమ్రాన్, ఖాజామస్తాన్, వినాయక, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి 95 పుస్తకాల వితరణ



పుస్తకాలు వితరణ చేస్తున్న దాతలు

పాకాల: మండలంలోని దామలచెరువు శాఖా గ్రంథాలయానికి విశ్రాంత టీచర్ రావిళ్ల సిద్ధయ్యానాయుడు జ్ఞాపకార్థం 95 పుస్తకాలను వితరణ చేశారు. బుధవారం మొగరాల పంచాయతీ తోటతిమ్మయ్యగారిపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సిద్ధయ్యానాయుడు కుమారులు ఆర్.మధుసూదన్‌నాయుడు, ఆర్.హరిప్రసాద్, ఆర్.అశోక్‌కుమార్, ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న తమ్ముడు సిద్ధయ్యానాయుడు సుమారు రూ.20 వేలు విలువ గల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జ్ మురళిబాబు, పాఠకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న సర్పంచ్ సునీత

పాకాల: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు అందజేశారు. బుధవారం దామలచెరువు పంచాయతీలో కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ సునీత చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏటా పంచాయతీ కార్మికులకు అవసరమైన వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇమ్రాన్, రహీం, వినాయక, నరేష్, మహ్మద్, గౌస్‌బాషా, ఈఓ మోతి, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్



వెంకటరమణ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ టి.వెంకటరమణ (వెంకీ)ను ఎస్పీ మలికా గార్గ్ సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన భార్యాభర్తల వివాదంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వెంకటరమణపై అభియోగం రుజువు కావడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తుడా నిధులతో బోరు ఏర్పాటు

పాకాల : మండలంలోని ఆదినపల్లి పంచాయతీ శ్రీనివాసపురంలో తుడా నిధులతో నీటి బోరు ఏర్పాటు చేశారు. బుధవారం స్థానిక గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో జరిగిన గడపగడపకు మహాపాదయాత్ర కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దృష్టికి తమ గ్రామంలోని నీటి సమస్యను తెలిపామన్నారు. అడిగిన వెంటనే తుడా నిధులు రూ.4 లక్షలు మంజూరు చేసి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చూపారని హర్షం వ్యక్తం చేశారు. అడిగిన వెంటనే గ్రామంలో సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబానికి తాము రుణపడి ఉంటామన్నారు.

ఆధునిక హంగులతో ఎంపీడీఓ కార్యాలయం



ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న తుడా చైర్మన్, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు

- రూ.90 లక్షలతో నిర్మించనున్న భవనం
- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన తుడా చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి
- త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులకు సూచన

చంద్రగిరి: చంద్రగిరి నూతన ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. బుధవారం స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నూతన భవన నిర్మాణానికి తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక టవర్‌క్లాక్ వద్ద వెలసిన శ్రీవినాయక స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి ఊరేగింపుగా కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ వేద పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తదుపరి ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డితో కలసి ఆయన ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

రూ.90 లక్షలతో నూతన కార్యాలయం

చంద్రగిరి ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనాన్ని సుమారు రూ.90లక్షలతో నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. అత్యాధునిక హంగులతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారని, త్వరితగతిన పనులు పూర్తి చేసేలా సంబంధిత అధికారులను ఆయన కోరారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడం జరిగిందన్నారు.

కళ్లెదుటే అభివృద్ధి

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు కళ్లెదుటే ప్రతి ఒక్కరికీ కనిపిస్తున్నాయని, ఇది కాదనలేని సత్యమని మోహిత్‌రెడ్డి అన్నారు. తుడా చైర్మన్‌గా నియమితులైన తాను ఇంతటి అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలను కల్పించిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి మాత్రమే సాధ్యపడిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీలో జరిగిన



తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

అభివృద్ధి పనులు, వాటికి వెచ్చించిన నగదు వివరాలతో సహా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదికుప్పం రూప, ఉప సర్పంచ్ నగరి చంద్ర, ఎంపీడీఓ సూర్యసాయి, తహసీల్దార్ మారుతి, ఈఓపీఆర్డీ శశిరేఖ, మార్కెట్ యార్డు చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, వరలక్ష్మీ, మండల కన్వీనర్ మస్తాన్, మాజీ ఎంపీపీలు లోకయ్య నాయుడు, వేణుగోపాల్ రెడ్డి, కుసుమ కుమారి, మండల కోఆప్షన్ సభ్యుడు ఔరంగజేబుతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మల్లంగుంటలో ముంచెత్తిన అభిమానం



మల్లంగుంటలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబంపై తమ అభిమానం, ఆత్మీయతను మల్లంగుంట వాసులు మరోసారి చాటారు. గత మూడు రోజులుగా మల్లంగుంట పంచాయతీలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి చేపట్టిన గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమం మూడో రోజు బుధవారం కొనసాగింది. గ్రామంలో గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రూ.వందల కోట్లతో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందని ఆమె కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతుడు, ప్రజాసేవ పట్ల అంకితభావం కలిగిన మోహిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా అందించాలని కోరారు. అంతకుముందు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మునస్వామిరెడ్డి, సర్పంచ్ రామచంద్రయ్య, వైస్ సర్పంచ్ జయచంద్రారెడ్డి, ఎంపీటీసీ హేమాద్రి, నాయకులు సురేంద్రరెడ్డి, సంజీవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల కరపత్రాలను గ్రామస్తులకు అందిస్తున్న చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి

రామచంద్రాపురం: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాయలచెరువు, ఒడ్డుకాల్వ, బాదూరుపేట గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. ప్రతి గడపలోనూ మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, కుప్పంబాదూరు పీహెచ్‌సీ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు రాజేష్, కృష్ణవేణమ్మ, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు నాయుడు, పంచాయతీ కన్వీనర్ దొరస్వామి, గొడ సంఘం డైరెక్టర్ మాదాసు హేమలత, వైస్ సర్పంచ్ వెంకటముని, పీహెచ్‌సీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు కోదండరెడ్డి, రవి, మారయ్య, భాస్కర్ రెడ్డి, మధు, యశ్వంత్, సెంథిల్, సుబ్రమణ్యం, మురగయ్య, బాలవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సైన్స్‌తోనే మానవ జీవితం

- ఘనంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవం
- అబ్బుర పరచిన విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ లలిత కుమారి

పాకాల: మానవ జీవితంలో ప్రతి ఒక్కటీ సైన్స్‌తో ముడిపడి ఉన్నాయని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాలలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆధునిక కాలంలో సైన్స్ ప్రాముఖ్యత చాలా ఉందని, శాస్త్రవేత్త సీవీ రామన్ ఫిబ్రవరి 28వ తేదీన రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారని, ఏటా అదే రోజున నేషనల్ సైన్స్ డే జరుపుకుంటామని తెలిపారు. అలాగే పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాల మోడళ్లను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులక బహుమతులను ప్రదానం చేశారు. అలాగే దామలచెరువు ఎంపీపీ పాఠశాలలో లయన్స్‌క్లబ్ సభ్యులు జాతీయ సైన్స్‌డేలో పాల్గొని ప్రదర్శనకు ఉంచిన ప్రయోగాలను పరిశీలించి తరగతుల వారీగా బహుమతులను ప్రదాధానం చేశారు. అలాగే రూ.7 వేలు విలువ చేసే కుర్చీలను లయన్ షాజహాన్ చేతుల మీదుగా స్కూల్‌కు వితరణ చేశారు.

డిగ్రీ కళాశాలలో సైన్స్‌డే..

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన సైన్స్ డేలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధిలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని, వికసిత్ భారత్ 2047 సాధనలో సైన్స్‌కు సంబంధించిన వివిధ అంశాలపై విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, పీపీటీ ప్రజెంటేషన్‌తో వివరించారు. అలాగే ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సురేంద్ర, కన్వీనర్ మోహన్‌బెహరా, రమేష్‌కుమార్, ఈశ్వర్‌బాబు, రవి, లక్ష్మీప్రసాద్ రెడ్డి, మాధవి, విష్ణుప్రియ, లక్ష్మీప్రసన్న, హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లయన్ నాగూర్‌బాష, సభ్యులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: మండల పరిధిలోని నరశింగాపురం ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు లలితకుమారి, భాస్కర్ బాబు హాజరై విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. ప్రతి తరగతిలో ఉన్న ప్రతి విద్యార్థి స్వయంగా ఒక్కో ఎగ్జిబిట్‌ను ప్రదర్శించి తమ శాస్త్రీయాభి రుచిని చాటుకోవడం చాలా అభినందనీయమని మండల ఎంఈఓలు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉంచిన ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శనతో పాటు సర్ సీవీ రామన్ గురించి రాసిన వ్యాసరచనలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

భాకరాపేటలో..

భాకరాపేట : ప్రతి విద్యార్థి కూడా సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని శాస్త్రవేత్తలు కావాలని భాకరాపేట సీఐ మస్తాన్‌వలీ తెలిపారు. బుధవారం భాకరాపేటలో గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సైన్స్ మేళా, ఫుడ్ ఫెస్టివల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన 300 రకాల ప్రయోగాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 గోపీనాథ్, స్కూల్ కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సాకిరి భూపాల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబ్జీ



ప్రయోగాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా



భాకరాపేటలో సైన్స్ మేళాలో విద్యార్థులు

స్కూటరిస్టుకు తీవ్రగాయాలు

భాకరాపేట : భాకరాపేట ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు గాయపడినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. బుధవారం రాత్రి తిరుపతి నుంచి పీలేరుకు విజయ్ తన బైక్‌పై వస్తుండగా, భాకరాపేట ఘాట్ రోడ్డులో ట్యాంకర్‌ను ఢీకొన్నాడు. పోలీసులు క్షతగాత్రున్ని 108లో తిరుపతి రుయాకు తరలించారు. అతని తలకు బలమైన గా యంతో పాటు కాలు విర గ్గా, అతని తల్లికి స్వల్పగాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

– నేడు ధ్వజారోహణం



పుట్టమన్నును సేకరిస్తున్న అర్చకులు , విశేష అలంకరణలో దర్శనమిస్తున్న సేనాధిపతి

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు, రంగవల్లులుతో అందంగా తీర్చిదిద్దా రు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్వామి వారి భారీ కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

శాస్త్రోక్తంగా అంకురార్పణ..

శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన కార్యక్రమాలతో నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి వైఖానస ఆగమోక్తంగా ఆర్జిత నిత్య కల్యాణోత్సవాన్ని జరిపించారు. సాయంత్రం 6 గంటల నుంచి మత్స్యంగ్రహణం, సేనాధిపతి ఉత్సవాలను అర్చకులు వేడుకగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం చేపట్టి, ఉత్సవర్లను ఆలయంలోకి వేంచేపు చేసి అర్చకులు ఆలయంలో పుట్టమన్ను తీసి యజ్ఞయాగాది కార్యక్రమాలు చేపట్టారు.

నేడు ధ్వజారోహణం

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో అన్ని రకాల ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్లు చెంగల్‌రాయులు, వెంకటేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు యోగిమల్లవరంలో వెలసిన శ్రీకామాక్షి సమేత పరాశరేశ్వర స్వామివారి మహా శివరాత్రి ఉత్సవాలు మార్చి 8వ తేదీ నుంచి 10 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి బుధవారం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. శివరాత్రి ఉత్సవాలకు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్సీకి వివరించారు. ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంను శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న చైర్మన్ శ్రీధర్ రెడ్డి